క్లుప్తంగా

రెండోరోజు ఒక్క నామినేషన్



కాలె యాదయ్య తరుఫున నామినేషన్ వేస్తున్న కుమారుడు శ్రీకాంత్

చేవెళ్ల: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా చేవెళ్లలో రెండోరోజు ఒక్కటే నామినేషన్ వచ్చినట్లు రిటర్నింగ్ అధికారి సాయిరాం తెలిపారు. శనివారం చేవెళ్ల ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలె యాదయ్యకు సంబంధించిన ఒక సెట్‌ను ఆయన కుమారుడు శ్రీకాంత్, పార్టీ నాయకులు మహేందర్‌రెడ్డి, శ్రీహరిలు కలిసి నామినేషన్ వేసినట్లు తెలిపారు. మొదటిరోజు ఒక్కటి, రెండవ రోజు ఒక్కటి మొత్తం రెండు రోజుల్లో రెండు నామినేషన్‌లు వచ్చినట్లు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

ట్రాఫిక్ ఎస్‌ఐ రవీందర్‌నాయక్

షాద్‌నగర్‌రూరల్: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ట్రాఫిక్ ఎస్‌ఐ రవీందర్‌నాయక్ అన్నారు. శనివారం పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల సందర్భంగా అధికారులు లింగారెడ్డిగూడ సమీపంలోని ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. నామినేషన్ కేంద్రంవద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా 144 సెక్షన్ విధించామన్నారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పాత జాతీయ రహదారిపై బారికేడ్లను ఏర్పాటు చేశామన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించి ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు.

బీఆర్‌ఎస్‌లోకి సయ్యద్ ఇబ్రహీం

షాద్‌నగర్: కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు సయ్యద్ ఇబ్రహీం శనివారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. షాద్‌నగర్‌కు చెందిన సయ్యద్ ఇబ్రహీం గతంలో మహబూబ్‌నగర్ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. శనివారం ఉదయం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ షాద్‌నగర్‌లోని సయ్యద్ ఇబ్రహీం నివాసానికి వెళ్లి బీఆర్‌ఎస్‌లో చేరాలని ఆహ్వానించారు. దీంతో సయ్యద్ ఇబ్రహీం తన అనుచరులతో కలిసి హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరారు.

బీజేపీలో చేరిన రవీందర్‌యాదవ్

మొయినాబాద్: అఖిల భారత యాదవ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్‌యాదవ్ బీజేపీలో చేరారు. శనివారం బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో ఆయన బీజేపీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్‌యాదవ్ మాట్లాడుతూ బీజేపీ బీసీకి సీఎం పదవి ఇస్తానని ప్రకటించడం శుభ పరిణామమన్నారు.

ఆటోలో తరలిస్తున్న గంజాయి పట్టివేత

చేవెళ్ల: ఆటోలో తరలిస్తున్న కిలో గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన చేవెళ్ల మండలకేంద్రంలోని షాబాద్ చౌరస్తాలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో చేవెళ్లలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా షాద్‌నగర్ వైపు నుంచి చేవెళ్లకు వస్తున్న ఆటోలో సీట్ల కింద గంజాయి తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. ఆటోలో దొరికిన గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకొని సీజ్‌చేశారు. ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన రాజ్‌కుమార్, బీహార్ రాష్ట్రానికి చెందిన దీప్‌కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



మొయినాబాద్‌రూరల్: సజ్జన్‌పల్లిలో బీఆర్‌ఎస్‌లో చేరిన యువకులు



శేరిగూడలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సంక్షేమ పథకాలే పార్టీకి రక్ష

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- మూడోసారి గెలిపించాలని ఇంటింటి పర్యటన
- అభివృద్ధిని చూసి ఓటెయ్యండి
- కనకమామిడి, సజ్జన్‌పల్లి, అప్పారెడ్డిగూడ, శేరిగూడ, మొయినాబాద్‌లో ప్రచారం



మొయినాబాద్: ఎన్నికల ప్రచారంలో ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

మొయినాబాద్‌రూరల్: అభివృద్ధి, సంక్షేమపథకాలే పార్టీకి రక్ష అని ప్రజలు, నాయకులు, కార్యకర్తలు ఆదరించి అభిమానించి తనను గెలిపించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. కనకమామిడి, సజ్జన్‌పల్లి, అప్పారెడ్డిగూడ ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారాన్ని మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య గడపగడపకు తిరుగుతూ తనను గెలిపించాలని కోరారు. సజ్జన్‌పల్లి గ్రామంలో సి.నర్సింహ్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నరేందర్, ముఖేష్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, యాదయ్య, నరేందర్, మిథుల్, ఎత్మార్‌పల్లి ప్రవీణ్‌రెడ్డి తదితరులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన ప్రచార సభల్లో కాలె యాదయ్య మాట్లాడుతూ పది సంవత్సరాల్లో సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గుర్తించి తనను మూడోసారి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి అనంతరెడ్డి, జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, ఎంపీపీ నక్షత్రం జేవంతు, సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాహుఫ్, మాజీ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, కనకమామిడి సర్పంచ్ పట్లోళ్ల జనార్దన్‌రెడ్డి, ఉపసర్పంచ్ మర్రి రాంరెడ్డి, అధ్యక్షుడు శ్రీరామ్‌రెడ్డి, ఎంపీటీసీ ప్రభావతిగణేష్‌రెడ్డి, రాష్ట్ర వార్డు సభ్యుల ఫోరం అధ్యక్షుడు కొత్తపల్లి తిరుపతిరెడ్డి, సర్పంచ్‌ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రాఘవరెడ్డి, మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సింహ్మాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లిలో..

శంకర్‌పల్లి: బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలె యాదయ్య మూడోసారి విజయం సాధించడం ఖాయమని శంకర్‌పల్లి ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శేరిగూడ గ్రామంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలె యాదయ్యకు ఓటు వేసి గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే పార్టీ అభ్యర్థులను గెలిపిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో శేరిగూడ సర్పంచ్ మైలారం సత్యనారాయణ, మండల యువజన విభాగం అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కావలి గోపాల్, సాత ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌లో..

మొయినాబాద్: ఈ ఎన్నికల్లో అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటెయ్యండని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మొయినాబాద్ మండల కేంద్రంలో కాలె యాదయ్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ దేశంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దారన్నారు. ఏ రాష్ట్రంలోలేని అభివృద్ధి, సంక్షేమ పథకాలు తెలంగాణలో కొనసాగుతున్నాయన్నారు. కాంగ్రెస్, బీజేపీలు చెప్పే కల్లబొల్లి మాటలు విని మోసపోవద్దన్నారు. మళ్లీ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, ఏఎంసీ వైస్ చైర్మన్ రవుఫ్, మైనార్టీ నేత మహబూబ్, మండల ఉపాధ్యక్షుడు జయవంత్, ఎంపీటీసీలు మల్లేశ్, శ్రీనివాస్, సురేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి

చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పి కార్తీక్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: మైనార్టీల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎన్నికల ఇన్‌చార్జి పి కార్తీక్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్యలు పేర్కొన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలోని బీఆర్‌ఆర్ ఫాంహౌస్‌లో శనివారం మండల మైనార్టీలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం మైనార్టీ గురుకులాలు ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. షాదిముబారక్ పథకంతో ముస్లిం కుటుంబాల్లో పేద వారికి అండగా నిలిచిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి కాంగ్రెస్ మైనార్టీల ఓట్లు వేయించుకొని చేసిందేమీ లేదని కాంగ్రెస్‌ని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పాటు పడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీపీ ఎం.విజయలక్ష్మీరమణారెడ్డి, జెడ్పీటీసీ ఎం.మాలతి క్రిష్టారెడ్డి, బాసిత్, ఖాదార్, బాబార్, గని, జాఫర్, ఇనాయిత్, ఇక్రమొద్దీన్, నయామ్, సర్పంచులు వెంకటేశంగుప్తా, మల్లారెడ్డి, శివారెడ్డి, భీమయ్య, మిట్ట రంగారెడ్డి, రమణారెడ్డి, క్రిష్టారెడ్డి, రామగౌడ్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య



సంకెపల్లిగూడలో పూజలో పాల్గొన్న పామెన భీంభరత్

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి భీంభరత్, ముద్దెంగూడ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య పేర్కొన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని సంకెపల్లిగూడ గ్రామంలో ఎల్లమ్మ, మైసమ్మ దేవాలయంలో యజ్ఞహోమాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతిఒక్కరూ సంతోషంగా ఉండగలుగుతారన్నారు. మారుమూల గ్రామాల్లో దేవలయాలు నిర్మించి పూజలు చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చింపుల సత్యనారాయణరెడ్డి, పీసరీ సురేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే అభ్యర్థి అందె బాబయ్య



తిమ్మాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

కొత్తూరు: బీజేపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధిస్తుందని షాద్‌నగర్ బీజేపీ అభ్యర్థి అందెబాబాయ్య అన్నారు. శనివారం కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి మోది ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే పనులను గురించి ఓటర్లకు వివరించారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు లోపాయికారి ఒప్పందాలతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీవర్ధన్‌రెడ్డి, నర్సింహ్మాగౌడ్, వేణుగోపాల్‌చారి, తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ఎవరికో?

- ప్రధాన నాయకులు కార్యకర్తలతో నవీన్‌రెడ్డి సమావేశం
- ఒకటి, రెండ్రోజుల్లో బీఆర్‌ఎస్‌లో చేరే అవకాశం



మాట్లాడుతున్న నవీన్‌రెడ్డి

నందిగామ: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మాజీ జెడ్పీవైస్ చైర్మన్, కొత్తూరు మాజీ జెడ్పీటీసీ నాగరకుంట నవీన్ రెడ్డిల మద్దతు ప్రస్తుతం షాద్‌నగర్ నియోజకవర్గంలో ప్రధాన పార్టీల అభ్యర్థులకు కీలకంగా మారింది. కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడిన నవీన్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్‌కు ఇస్తారా? లేక బీఆర్‌ఎస్ అభ్యర్థి అంజయ్య యాదవ్‌కు ఇస్తారా? అనే విషయమై స్థానికంగా చర్చ జరుగుతుంది. ఈ నేపథ్యంలో నవీన్ రెడ్డి శనివారం మండలంలోని మొదళ్లగూడలో పలు గ్రామాలకు చెందిన అభిమానులు, అనుచరులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ పార్టీ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని సమావేశంలో అభిప్రాయాలు సేకరించారు. అనంతరం పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ తమకు పార్టీలతో సంబంధం లేదని, నవీన్ రెడ్డి తీసుకున్న నిర్ణయానికే తామంతా కట్టుబడి ఉంటామని వారు ఏకగ్రీవంగా నిర్ణయం ప్రకటించారు. సమావేశంలో వచ్చిన అభిప్రాయాలు, సూచనలననుసరించి అధికార బీఆర్‌ఎస్‌లో ఒక్కటి, రెండు రోజుల్లో నవీన్ రెడ్డితో పాటు పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు, అభిమానులు పెద్ద ఎత్తున చేరే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

షాద్‌నగర్‌లో..

షాద్‌నగర్: ఎంపీటీసీగా గెలువని వీర్లపల్లి శంకర్ ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎలా గెలుస్తాడని మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం రాత్రి పట్టణ శివారులోని రసోయ్ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ కుటుంబం ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ సేవ చేస్తుందన్నారు. వార్డు సభ్యుడి స్థాయి నుంచి జెడ్పీ వైస్ చైర్మన్ స్థాయి వరకు తమ కుటుంబంలోని వ్యక్తులు పదవులు అదిష్ఠించామన్నారు. శంకర్‌రావు, చౌలపల్లి ప్రతాప్ రెడ్డిలను ఎమ్మెల్యేలుగా గెలిపించడం వెనక తమ కుటుంబ సభ్యులు ఎంతో కృషి చేశారన్నారు. ఎలాంటి రాజకీయ చరిత్ర లేని వ్యక్తికి కాంగ్రెస్ టికెట్ ఇవ్వడం దౌర్భాగ్యమన్నారు. తాము ఏ వ్యాపారం చేస్తున్నామో చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని, వీర్లపల్లి శంకర్ ఏ వ్యాపారం చేసి కోట్లు గడించారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌ది మూడో స్థానమే

చేవెళ్ల: బీఆర్‌ఎస్‌కి ఈ ఎన్నికల్లో తిరుగులేదని కాంగ్రెస్ మూడో స్థానంలో ఉంటుందని ఎంపీపీ ఎం విజయలక్ష్మీ అన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ బలమైన పార్టీగా ఎదిగిందన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పార్టీని గెలిపిస్తాయన్నారు. జాతీయ పార్టీలుగా చెప్పుకునే కాంగ్రెస్, బీజేపీలు బీఆర్‌ఎస్‌ను అందుకోలేవన్నారు. చేవెళ్లలో కాంగ్రెస్ మూడోస్థానంతో సరిపెట్టుకోకతప్పదన్నారు. కాంగ్రెస్, బీజేపీలు ఎన్నో ఏళ్ల నుంచి పాలన చేసినా దేశంలో, రాష్ట్ర అభివృద్ధిలో చేసిందేమిలేదన్నారు.

వీర్లపల్లిని విమర్శిస్తే సహించం

కాంగ్రెస్ గిరిజన విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ రఘు



షాద్‌నగర్: సమావేశంలో మాట్లాడుతున్న రఘు

షాద్‌నగర్: కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్‌ను విమర్శిస్తే సహించమని గిరిజన విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ రఘు హెచ్చరించారు. శనివారం పట్టణంలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వీర్లపల్లి శంకర్‌పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం బాధాకరమన్నారు. నవీన్‌రెడ్డి చేసిన భూ కబ్జాలు గురించి అందరికీ తెలిసిందేనన్నారు. ఎంతో మంది బాధితులు అతనిపై పోలీస్ స్టేషన్‌లో కేసులు పెట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నేర చరిత్ర ఉన్న నవీన్‌రెడ్డిపై ఇప్పటి వరకు 28 కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే నవీన్‌రెడ్డి అక్రమాలపై ప్రత్యేక విచారణ చేయిస్తామని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్‌ను భయపెట్టిస్తున్న నవీన్‌రెడ్డిపై ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బాబర్‌ఖాన్, కొంకళ్ల చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, దంగు శ్రీనివాస్ యాదవ్, కోన దేవయ్య, అప్పి, సిద్ధార్థ, ఎర్రోళ్ల జగన్, శ్రీను నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నవీన్ రెడ్డి ఖబార్దార్

నందిగామ: మాజీ జెడ్పీవైస్ చైర్మన్ నాగరకుంట నవీన్ రెడ్డికి షాద్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వీర్లపల్లి శంకర్‌ను విమర్శించే అర్హత లేదని ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు, నందిగామ ఎంపీటీసీ కొమ్ము కృష్ణ మండిపడ్డారు. నందిగామలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూ కబ్జాదారుడైన నవీన్ రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వీర్లపల్లి శంకర్ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికే పదుల సంఖ్యలో పోలీసు కేసులు ఎదుర్కొంటున్న ఆయన కాంగ్రెస్ ఇచ్చిన బీఫారంతో జెడ్పీటీసీగా గెలిచి కాంగ్రెస్ నాయకులను విమర్శించడం బాధాకరమన్నారు. నవీన్ రెడ్డి ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నాడో ఆయనకే తెలియదని, అలాంటి నవీన్ రెడ్డి వీర్లపల్లి శంకర్‌ను విమర్శించడం దారుణమని మండిపడ్డారు. ఈ సమావేశంలో ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు అనంతయ్య, నందిగామ పీఏసీఎస్ వైస్ చైర్మన్ జంగ రజనీ కాంత్, ఎంపీటీసీ సభ్యుడు చంద్రపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షటర్‌ను పగులగొట్టి చోరీ

రూ.70వేలు, 30 తులాల వెండి అపహరణ

షాద్‌నగర్‌రూరల్: గుర్తు తెలియని వ్యక్తులు షటర్‌ను పగులగొట్టి కిరాణం షాపులో చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన శుక్రవారం అర్ధ రాత్రి ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన జవార్‌రాం కొన్నేళ్ల క్రితం ఎలికట్టకువచ్చి కిరాణం షాపు నిర్వహిస్తున్నాడు. ఎప్పటిలాగే శుక్రవారం రాత్రి జవార్‌రాం షాపును మూసివేసి ఇంటికి వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు అర్ధ రాత్రి సమయంలో షటర్‌ను పగులగొట్టి రూ.70వేలు, 30తులాల వెండి అపహరించారని పేర్కొన్నారు. శనివారం ఉదయం జవార్‌రాం షాపును తెరిచే చూసే సరికి షటర్‌ను పగులగొట్టినట్లు గమనించాడు. వెంటనే ఈ విషయాన్ని పోలీసులకు చేరవేశాడు. జవార్‌రాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ అలంక్రిత్‌గౌడ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి గల్లంతు

ఆచూకీ కోసం గాలించాలని కుటుంబ సభ్యుల మొర

షాద్‌నగర్‌రూరల్: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి గల్లంతైన సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. లింగారెడ్డిగూడ గ్రామానికి చెందిన క్రిష్ణ(35) కుటుంబ సభ్యులతో కొన్నేళ్లుగా షాద్‌నగర్ పట్టణంలో నివసిస్తున్నాడు. శుక్రవారం వీర్లపల్లి శివారులోని నీటి గుంతలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. సాయంత్రం వరకు చూసినా ఎంతకు రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి క్రిష్ణ ఆచూకీకోసం గాలింపు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

కాంగ్రెస్‌కు అధికారం ఖాయం

పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



మద్దూరు సర్పంచ్ నరేందర్‌రెడ్డి, దండు రాహుల్ గుప్తాను పార్టీలోకి ఆహ్వానిస్తున్న రేవంత్‌రెడ్డి

షాబాద్: కాంగ్రెస్‌కు అధికారం ఖాయమని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలో షాబాద్ మండల కేంద్రానికి చెందిన దండు రాహుల్ గుప్తా, మద్దూరు సర్పంచ్ నరేందర్‌రెడ్డి, సోలీపేట్ మాజీ సర్పంచ్‌లు జనార్ధన్‌రెడ్డి, నరేందర్, సహకార సంఘం మాజీ డైరెక్టర్ రాంరెడ్డి, ఉపసర్పంచ్ మోహన్‌నాయక్‌లతో పాటు సుమారు 400 మంది బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరారు. వారికి రేవంత్‌రెడ్డి పార్టీ కడువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టనున్న ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పాలనపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటమి తప్పదన్నారు. ప్రతి ఒక్కరూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారన్నారు. అవినీతి, నియంతత్వ దోపిడీ పాలన చేస్తున్న బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను ఓడించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు పీసరి సురేందర్‌రెడ్డి, రాంరెడ్డి, మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ శేఖర్, ఆంజనేయులు, సుభాష్‌రెడ్డి, శ్రీరాంరెడ్డి, గోరీశ్వర్, భరత్, శ్రీశైలం, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, శేఖర్, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ పాలనకు చరమగీతం పాడాలి

కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లిశంకర్



పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న శంకర్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కుటుంబ పాలనకు చరమగీతం పాడాలని కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లిశంకర్ అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని సోలీపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు పట్టణ అధ్యక్షుడు కొంకళ్లచెన్నయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వీర్లపల్లిశంకర్, చౌలపల్లిప్రతాప్‌రెడ్డి పార్టీలో చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నియంతృత్వ పాలనలో ప్రజలు అనేక కష్టాలను ఎదుర్కొన్నారన్నారు. కుటుంబ పాలనలో ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్‌అలీఖాన్‌బాబర్, అందెమోహన్, జమ్రుద్‌ఖాన్, ఖాదర్‌గోరి, నవాజ్‌గోరి, అగ్గనూరిబస్వం, అలీం షకీబ్, మురళీమోహన్, రాజేష్‌గౌడ్, గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనను తరిమి కొట్టండి



చేవెళ్ల: ఇంటింటి ప్రచారంలో ఓటు అడుగుతున్న భీంభరత్



మొయినాబాద్‌రూరల్: పాటి ప్రసాద్‌రెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న భీంభరత్

కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్

చేవెళ్ల: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలనను తరిమి కొట్టాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్ అన్నారు. శనివారం చేవెళ్ల మండలంలోని దేవరాంపల్లి, రేగడిఘనాపూర్, నాంచేరి, ఇంద్రారెడ్డి నగర్, కిష్టాపూర్, అంతారం, హస్తేపూర్, నౌలాయపల్లి, కౌకుంట్ల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్‌కి ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గ్రామాల్లో ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. బీఆర్‌ఎస్ మాయమాటలు నమ్మొద్దన్నారు. చేవెళ్లలో కుటుంబపాలన సాగిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్యను ఇంటికి పంపించే సమయం ఆసన్నమైందన్నారు. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, మళ్లీ ఇందిరమ్మ ఇళ్లు, రూ. 500లకు గ్యాస్ సిలిండర్, మహిళలకు రూ. 2,500లు, పింఛన్ రూ.4వేలు, 200ల యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ పక్కాగా అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం సమన్వయ కమిటీ చైర్మన్ చింపుల సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, చేవెళ్ల సర్పంచ్ శైలజ, మహిళ అధ్యక్షకార్యదర్శులు సమత, సరితలు అన్నారు. పీసీసీ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ కావలి సుజాత, మాజీ ఎంపీటీసీ పెంటయ్యగౌడ్, వెంకటేశ్‌బాబు, శంకర్, తరుణ, టేకుపల్లి శ్రీనివాస్, వాజిద్, ఫరూక్, క్రిష్ణయ్యగౌడ్, మహేందర్, ఆగిరెడ్డి, మధుసూదన్‌గుప్తా, శ్రీనివాస్‌గౌడ్, మల్లారెడ్డి, రాములు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రచారం

కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీంభరత్ శనివారం రాత్రి కౌకుట్ల, అంతారం గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో గ్రామస్తులు, మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా భీంభరత్ మాట్లాడుతూ గ్రామాల్లో బీఆర్‌ఎస్‌పై ఉన్న వ్యతిరేకత ప్రజల ముఖంలో కనిపిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణరెడ్డి, వీరేందర్‌రెడ్డి, వెంకటేశ్‌బాబు, డీవీఆర్, ఆగిరెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కారుకు ఓటేస్తే కష్టాలే..

మొయినాబాద్‌రూరల్: ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేస్తే కష్టాలు తప్పవని పీసీసీ కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన్, చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్‌లు అన్నారు. పెద్దమంగళారం గ్రామానికి చెందిన పాటి ప్రసాద్‌రెడ్డి తన అనుచరులతో కలిసి అమ్డాపూర్ గ్రామంలో నిర్వహించిన ప్రచార సభలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పాటి ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ నిరుపేదల అభివద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పార్టీ ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాణయ్య, జిల్లా మత్స్యకారిమక సంఘం అధ్యక్షుడు మహేందర్‌ముదిరాజ్, అమ్డాపూర్ కాంగ్రెస్ నాయకులు మంగళి అంతయ్య, గొల్ల అంతయ్య, చాకలి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.